క్లుప్తంగా

'ఆడుదాం ఆంధ్రా'లో వలంటీర్లే కీలకం


మాట్లాడుతున్న రామారావు

ఇచ్ఛాపురం రూరల్: గ్రామీణ క్రీడాకారుల ప్రతిభను వెలికితీసేందుకు నిర్వహిస్తున్న 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమంలో వలంటీర్లదే కీలక బాధ్యతని ఎంపీడీవో కె.రామారావు అన్నారు. ఇచ్ఛాపురం నియోజకవర్గస్థాయి పరిధిలో ఉన్న వలంటీర్లకు 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమంపై ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని ఇచ్ఛాపురంలో మంగళవారం నిర్వహించారు. గ్రామ సచివాలయం సిబ్బందితో పాటు ఇద్దరేసి వలంటీర్లు ఈ క్రీడా శిబిరాల్లో భాగస్వామ్యం కావాలని అన్నారు.

రోగులకు దుప్పట్లు పంపిణీ


రోగులకు దుప్పట్లు అందజేస్తున్న సంఘం సభ్యులు

టెక్కలి: పట్టణానికి చెందిన అభయం యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో స్థానిక జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నిరుపేద రోగులకు మంగళవారం దుప్పట్లు పంపిణీ చేశారు. శీతాకాలం కావడంతో వివిధ అనారోగ్య సమస్యలతో ఆస్పత్రిలో చేరిన రోగుల కోసం దుప్పట్లు సమకూర్చినట్టు యువజన సంఘం సభ్యులు వెల్లడించారు. అలాగే ఆస్పత్రిలోని వివిధ విభాగాలకు థర్మామీటర్లు అందజేశామన్నారు. కార్యక్రమంలో వైద్యులు ఎ.వినోద్, అభయం సంఘం సభ్యులు డి.శ్రీనివాస్, ఎస్.సింహాచలం, పి.రమేష్, యు.గోవిందరావు, నర్సింగ్ సిబ్బంది బి.బాలామణి, పి.మాధురి ఉన్నారు.

వైభవంగా నందెన్నల తిరువీధి


యాత్రలో పాల్గొన్న భక్తజనం

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీ పరిధిలో ఉన్న 11 శివాలయాలకు చెందిన నంది విగ్రహాలను సోమవారం అర్ధరాత్రి ఘనంగా తిరువీధి నిర్వహించారు. కార్తీకమాసం చివరి సోమవారం కావడంతో రత్నేశ్వరాలయం, ఖండేశ్వరాలయం, పాతాళసిద్దేశ్వరాలయం, చంద్రశేఖరాలయం, రామలింగేశ్వరాలయం, చిదంబరేశ్వరాలయం, నర్మదేశ్వరాలయం, తారకేశ్వరాలయం, నీలకంఠేశ్వరాలయం, కాశీవిశ్వనాథాలయం, ఉమామహేశ్వరాలయాలకు చెందిన శివనంది విగ్రహాలకు తీరువీధి చేపట్టారు. అనంతరం దాసన్నపేట కూడలిలో శివనందెలను ఒక దగ్గరికి చేర్చి ప్రత్యేక యాత్రను మంగళవారం తెల్లవారుజాము వరకు నిర్వహించారు. పట్టణ, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు.

పరిశోధనలకు అనుగుణంగా పుస్తకాలు రచించాలి

టెక్కలి: సాంకేతిక విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు అనుగుణంగా అధ్యాపకులు పుస్తకాలు రచించాలని టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు అన్నారు. కళాశాలకు చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ నడిమింటి శైలజ రచించిన 'ఇంగ్లిష్ కమ్యూనికేషన్ స్కిల్స్ ఫర్ ఇంజినీర్స్' అనే పుస్తకాన్ని మంగళవారం ఆవిష్కరించారు. బీటెక్, ఎంటెక్ విద్యార్థులకు ఈ పుస్తకం ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, హెచ్ఓడీ ఆర్.శాంతికుమార్ ఉన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన


శంకుస్థాపన కార్యక్రమంలో గిరిబాబు, సురేష్‌బాబు

కాశీబుగ్గ: మున్సిపాలిటీ నాలుగో వార్డు అంబుసోలి గ్రామంలో 20 లక్షల రూపాయలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు మున్సిపల్ చైర్మన్ బళ్ల గిరిబాబు, వైస్ చైర్మన్ మీసాల సురేష్‌బాబు మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ నిధులతో వాటర్ పైప్‌లైన్, ఇందిరానగర్‌లో సీసీ రోడ్డును నిర్మించనున్నారు. వైస్ చైర్మన్ బి.క్రిష్ణారావు, నాయకులు సింహాచలం, దుర్గశంకర్ డబ్బీరు భవానీశంకర్ ఉన్నారు.

ఆర్థిక సాయం

ఇచ్ఛాపురం రూరల్: కష్టాల్లో ఉన్న కుటుంబానికి కేశుపురం గ్రామానికి చెందిన కాళీమాత సేవా సమితి అండగా నిలిచింది. బారువ గ్రామానికి చెందిన దున్న కిరణ్‌కుమార్ విశాఖలో వలస కూలీగా పనిచేస్తూ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మృతుడు భార్య ప్రస్తుతం నెలలు నిండిన గర్భవతి కాగా, రెండు సంవత్సరాల బాబు ఉన్నాడు. కాళీమాత సేవా సమితి సభ్యులు మంగళవారం కేశుపురం గ్రామానికి వెళ్లి మృతుని భార్య సుశీలకు రూ.20 వేల నగదును అందజేశారు.

సంక్షేమ సారథికి అండగా ఉందాం

సంక్షేమ పథకాలతో అన్నివర్గాల ప్రజలను ఆదుకుంటున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రానున్న ఎన్నికల్లో అండగా నిలవాలని ప్రజాప్రతినిధులు కోరారు. 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని టెక్కలి, పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల్లోని పలు గ్రామాల్లో మంగళవారం నిర్వహించారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం చేరువ చేస్తోందని నాయకులు అన్నారు. ఈ సందర్భంగా సంక్షేమ పథకాల వివరాలతో కూడిన డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. వైఎస్సార్‌సీపీ జెండాలను ఎగరవేశారు.


ఇచ్ఛాపురం రూరల్: కొఠారీలో బ్రోచర్లు అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ


మందసలో డిస్‌ప్లే బోర్డు వద్ద జగనే మళ్లీ సీఎం కావాలంటూ నినాదాలు చేస్తున్న నాయకులు


టెక్కలి ఆదిఆంధ్రావీధిలో సంక్షేమ పథకాల ప్రచార కిట్లు అందజేస్తున్న నియోజకవర్గ సమన్వయకర్త దువ్వాడ వాణి, జేసీఎస్ ఇన్‌చార్జి మోహన్ తదితరులు


నందిగాం: శివరాంపురంలో ప్రగతి బోర్డును ఆవిష్కరిస్తున్న జేసీఎస్ ఇన్‌చార్జి జయరాం, సచివాలయ ఇన్‌చార్జి చిన్ని జోగారావు


కంచిలి: తలతంపర-1 సచివాలయం వద్ద పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు


కోటబొమ్మాళి: రేగులపాడులో డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న కాళింగ కార్పొరేషన్ డైరెక్టర్ సంపతిరావు హేమసుందరరావు తదితరులు


కవిటి:సహలాలపుట్టుగలో మాట్లాడుతున్న పార్టీ మండల కన్వీనర్ కడియాల ప్రకాష్

క్రీడాస్ఫూర్తిని అలవర్చుకోవాలి

- జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ


విజేతలకు బహుమతులు అందజేస్తున్న చైర్‌పర్సన్ పిరియా విజయ

కంచిలి: విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ క్రీడాస్ఫూర్తిని అలవర్చుకోవాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. గెలుపోటములను సమానంగా స్వీకరించాలని సూచించారు. మఠంసరియాపల్లి గ్రామంలోని ఏపీ మోడల్ స్కూల్ ఆవరణలో నాలుగు రోజులు నిర్వహించిన 76వ శ్రీకాకుళం ఒకటో జోన్ అంతర పాఠశాలల క్రీడా పోటీలు మంగళవారంతో ముగిశాయి. ముఖ్య అతిథిగా హాజరైన జెడ్పీ చైర్‌పర్సన్ విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు ఇప్పిలి లోలాక్షి, స్థానిక సర్పంచ్ కొణపల సురేష్, ఎంపీటీసీ సభ్యుడు బుడ్డెపు విశ్వనాథం, ప్రిన్సిపాల్ ఎస్.శివప్రసాద్ పాల్గొన్నారు.

హామీలన్నీ అమలు

- వైఎస్సార్‌సీపీ టెక్కలి సమన్వయకర్త దువ్వాడ వాణి
- కోటబొమ్మాళిలో 'గడప గడపకు మన ప్రభుత్వం'


బ్రోచర్లను అందజేస్తున్న సమన్వయకర్త దువ్వాడ వాణి

కోటబొమ్మాళి: పాదయాత్ర సమయంలో ఇచ్చిన అన్ని హామీలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేశారని వైఎస్సార్‌సీపీ టెక్కలి సమన్వయకర్త దువ్వాడ వాణి అన్నారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా పరిపాలన సాగిస్తున్న ఆయనకు రానున్న ఎన్నికల్లో మద్దతు పలకాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కోటబొమ్మాళి 1, 2 సచివాలయాల పరిధిలోని సీతన్నపేట, ఎప్పరిపేట, బంజీరుపేట గ్రామాల్లో 'గడప గడపకు మన ప్రభుత్వం'కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను తెలియజేశారు. నాలుగున్నరేళ్లలో చేకూరిన లబ్ధిని వివరించి అందుకు సంబంధించిన బ్రోచర్లను అందజేశారు. పీఏసీఎస్ అధ్యక్షుడు బాడాన మురళి, వైస్ ఎంపీపీ బోయిన నాగేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నూక సత్యరాజ్, జిల్లా రైతు సమాఖ్య సభ్యుడు కవిటి రామరాజు, నాయకురాలు దువ్వాడ హైంధవి, సర్పంచ్‌లు కాల్ల సంజీవరావు, అనపాన బాలకృష్ణ, సుంకరి జనార్దనరావు, రెడ్డి లక్ష్మణ, బొడ్డు వెంకటరమణ, తర్ర కామినాయుడు, దాసరి మోహనరావు, డబ్బీరు ప్రదీప్, బొడ్డు చెంచులు, బొడ్డు అప్పన్న, జేసీఎస్ మండల ఇన్‌చార్జి గెడ్డవలస నాగభూషణరావు, జేసీఎస్ కన్వీనర్లు ఎస్.నారాయణరావు, అక్కురాడ సురేష్, తోట సింహాచలం, డీలర్ కృష్ణారావు పాల్గొన్నారు.

వలంటీర్లకు నియామకపత్రాలు అందజేత


వలంటీర్‌కు నియామక పత్రాన్ని అందజేస్తున్న నాయకులు

ఇచ్ఛాపురం రూరల్: వలంటీర్లు ప్రజలకు మెరుగైన సేవలు అందించి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ పాతిర్ల రాజశేఖరరెడ్డి అన్నారు. లొద్దపుట్టి, కేశుపురం, తులసిగాం, బిర్లంగి గ్రామ సచివాలయం పరిధిలో వలంటీర్లుగా పలువురు ఎంపికయ్యారు. వీరికి ఎంపీడీవో కార్యాలయంలో నియామక పత్రాలను మంగళవారం అందజేశారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.రామారావు, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ తిప్పన నాగరాజురెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ఆశి పురుషోత్తమరెడ్డి, మాజీ ఎంపీపీ కారంగి మోహనరావు, సర్పంచ్ కారంగి త్రినాథ్, రంగాల జానీ, ఖోగయ్య, వెంకటరావులు పాల్గొన్నారు.

22న సుబ్బారావు పాణిగ్రాహి స్మారకసభ


సభను విజయవంతం చేయాలని ప్రచారం చేస్తున్న నాయకులు

సోంపేట: బొడ్డపాడు గ్రామంలోని అమరవీరుల స్మారక మందిరం వద్ద ఈ నెల 22వ తేదీన నిర్వహించనున్న విప్లవ సాంస్కృతిక ఉద్యమకారుడు సుబ్బారావు పాణిగ్రాహి 54వ స్మారక సభను విజయవంతం చేయాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర నాయకులు తాండ్ర ప్రకాష్ కోరారు. సోంపేటలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అరుణోదయ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నశెట్టి రాజశేఖర్, అఖిల భారత రైతుకూలీ సంఘం జిల్లా నాయకులు గొరకల బాలకృష్ణ, పర్యావరణ పరిరక్షణ సంఘం నాయకుడు బార్ల సుందరరావు, రైతు కూలీ సంఘం, ఐఎఫ్‌టీయూ, ప్రగతిశీల సంఘం నాయకులు పాల్గొన్నారు.

సక్రమంగా రుణాలు రికవరీ


మాట్లాడుతున్న విద్యాసాగర్

పలాస: బ్యాంకుల నుంచి ప్రజలు తీసుకున్న రుణాలను సక్రమంగా రికవరీ చేయాల్సిన బాధ్యత సంబంధిత సిబ్బందిపై ఉందని డీఆర్‌డీఏ పీడీ విద్యాసాగర్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పలాస నియోజకవర్గం స్థాయిలో అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. రుణాలు తీసుకున్నవారు తిరిగి చెల్లించేలా అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో ఎల్‌డీఎం సూర్యకిరణ్, ఎంపీడీవో రమేష్‌నాయుడు, వివిధ బ్యాంకర్ల మేనేజర్లు, వెలుగు, మెప్మా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జెడ్పీ చైర్‌పర్సన్ పరామర్శ


పరామర్శలో చైర్‌పర్సన్ విజయ తదితరులు

కంచిలి: మఠం సరియాపల్లి గ్రామానికి చెందిన నల్లాన శ్రవణ్ ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ మృతుని కుటుంబ సభ్యులను మంగళవారం పరామర్శించారు. ఆమె వెంట ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు ఇప్పిలి లోలాక్షి, స్థానిక సర్పంచ్ కొణపల సురేష్, ఎంపీటీసీ సభ్యుడు బుడ్డెపు విశ్వనాథం ఉన్నారు.

ఆశ కార్యకర్తకు సన్మానం

కోటబొమ్మాళి:


నాగేశ్వరమ్మను సన్మానిస్తున్న వైద్యసిబ్బంది

కస్తూరిపాడు ఆరోగ్యకేంద్రంలో ఆశ కార్యకర్తగా పనిచేసిన నాగేశ్వరమ్మ సేవలు అభినందనీయమని తిలారు ప్రాథమిక వైద్యశాల మెడికల్ ఆఫీసర్ మెండ మణీషా అన్నారు. నాగేశ్వరమ్మ మంగళవారం ఉద్యోగ విరమణ చేసిన సందర్భంగా ఆమెను వైద్యసిబ్బంది, తోటి ఆశ కార్యకర్తలు దుశ్శాలువతో సత్కరించారు. డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ వాన సురేష్, ఈవో శరశ్చంద్ర, సిబ్బంది సుశీల, రమణమ్మ పాల్గొన్నారు.

తెలుగు భాష విశ్వవ్యాప్తం కావాలి

- మంత్రి సీదిరి అప్పలరాజు


వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మంత్రి అప్పలరాజు

కాశీబుగ్గ: తెలుగు భాష వెలుగులు విశ్వవ్యాప్తం కావాలని మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఆకాంక్షించారు. ఆంధ్రసారస్వతా పరిషత్ ఆధ్వర్యంలో రాజరాజ నరేంద్రుల పట్టాభిషేక సహస్రబ్ది నీరాజనంగా డాక్టర్ గజల్ శ్రీనివాస్ అధ్యక్షతన రాజమండ్రిలో వచ్చేనెల 5, 6, 7 తేదీల్లో నిర్వహించనున్న రెండవ అంతర్జాతీయ తెలుగు మహాసభల గోడ పత్రికను పలాసలోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తెలుగు సాహితీ, సాంస్కృతిక వైభవం విశ్వవ్యాప్తం కావాలన్నారు. తెలుగు వైభవాన్ని చాటిచెప్పే ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నందుకు నిర్వాహకులు గజల్ శ్రీనివాస్‌ను, చైతన్యరాజులను అభినందించారు. మహాసభలను జయప్రదం చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. శ్రీకాకుళం ఆంధ్ర సారస్వత పరిషత్ సంచాలకులు లఖినాన రవికుమార్, డాక్టర్ గంజి ఏజ్రా, సంపతిరావు, సౌమ్య, ఎల్.వెంకటాచలం, కట్టా పార్థసారథి, పైడి రాము, అనిల్ రాజ్, ఏపీటీఎఫ్, యూటీఎఫ్ సంఘాల నాయకులు బల్ల సుభాష్‌బాబు, కంచరాన రమేష్, పలాస సారస్వత కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి


సమావేశంలో రైతు సంఘాల నాయకులు

మందస: రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని పలాస డివిజన్ రైతు సంఘం నాయకులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. హరిపురంలోని మార్పు గ్రంథాలయంలో మంగళవారం సమావేశమయ్యారు. జీడిపిక్కలు 80 కిలోల బస్తాకు రూ.16 వేలు మద్దతు ధర చెల్లించాలని, ఆర్బీకేల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, వంశధార, బహుదా నదుల అనుసంధానానికి నిధులు విడుదల చేయాలని, కొబ్బరిబోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. ఐటీడీఏను శ్రీకాకుళం జిల్లాలో ఏర్పాటు చేయాలని, మత్స్యకారులకు కోల్డ్‌స్టోరేజ్‌లు నిర్మించాలన్నారు. సమావేశంలో రైతు సంఘాల సమన్వయ కమిటీ నాయకులు మామిడి మాధవరావు, కోనారి మోహనరావు, టి.అజయ్‌కుమార్, జన్నిల ప్రసాదరావు, హేమారావుచౌదరి, మట్ట ఖగేశ్వరరావు, నల్ల హడ్డి, మజ్జి బాబురావు, సాతుపల్లి కృష్ణారావు తదితరులున్నారు.

ప్రకృతి వ్యవసాయ క్షేత్రంలో పంట కోత ప్రయోగం


పంటకోత ప్రయోగం చేస్తున్న సిబ్బంది

కాశీబుగ్గ: టెక్కలిపట్నం యూనిట్ పరిధి సవరపేట గ్రామానికి చెందిన రైతు సవర చిరంజీవి వరి క్షేత్రంలో పంట కోత ప్రయోగాన్ని అధికారులు మంగళవారం చేపట్టారు. చిరంజీవి ప్రకృతి వ్యవసాయ విధానాలు పాటిస్తూ వరిపంటను సాగు చేశారు. ఈయన క్షేత్రంలో పంట కోత ప్రయోగం చేయగా 5 5 మీటర్ల విస్తీర్ణంలో 15 కిలోల 700 గ్రాముల దిగుబడి వచ్చింది. ఎకరాకు 29 బస్తాల దిగుబడి వచ్చినట్టు వ్యవసాయాధికారులు చెప్పారు. ప్రకృతి వ్యసాయ ఎస్ఎఫ్ ఎస్‌డీఏ నాగరాజు, ఆశ, ఐసీఆర్‌పీలు కె.పాపారావు, అవ్వగాన షణ్ముఖరావు, ఎ.వెంకటలక్ష్మి, భారతి, తిరుపతిరావు ఉన్నారు.

ఘనంగా ఫ్యామిలీ క్రిస్మస్ వేడుకలు


వేడుకల్లో పాస్టర్స్ కుటుంబ సభ్యులు

కాశీబుగ్గ: టెక్కలి డివిజన్‌లో ఉన్న పాస్టర్స్ ఫ్యామిలీ క్రిస్మస్ వేడుకలు చిన్నబాడం క్రిస్టియన్ ప్రేయర్ టెంపుల్‌లో మంగళవారం జరిగాయి. రాజమండ్రికి చెందిన దైవసేవకులు ప్రశాంత్ కుమార్ క్రీస్తు సందేశాన్ని ఇచ్చారు పాస్టర్లకు నూతనవస్త్రాలను అందజేశారు. కార్యక్రమంలో బిషప్ డి.ఎస్.వి.ఎస్.కుమార్, ఎస్.కె.పానీ, డేవిడ్, క్రాయ్‌లు, ఆకోబు, ఆయ్ ప్రసాద్, ఏలీయా పాల్గొన్నారు.

నియోనేటల్ సేవలు వినియోగించుకోవాలి


వాహనాన్ని ప్రారంభిస్తున్న వైద్యాధికారులు

వజ్రపుకొత్తూరు రూరల్: మాతా శిశు మరణాల నివారణలో భాగంగా అప్పుడే పుట్టిన బిడ్డలకు అత్యవసర సమయంలో ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు రాష్ట్ర ప్రభుత్వం వినియోగంలోకి తీసుకొచ్చిన నియోనేటల్ 108 అంబులెన్స్ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని వెంకటపురం పీహెచ్‌సీ వైద్యాధికారి అంజలి, డాక్టర్ దేవి అన్నారు. ఈ మేరకు వజ్రపుకొత్తూరు మండలానికి ప్రభుత్వం కేటాయించిన నియోనేటల్ వాహనాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వాహనంలో ఇంక్యుబేటర్, మోనిటర్ డబుల్ ఆక్సిజన్, సిరెంజ్ పంపు, ఇన్‌ఫ్యూజన్ పంపు తదితర అత్యాధునిక వైద్య పరికరాలు అందుబాటులో ఉంటాయన్నారు. శిశుమరణాలను నియంత్రించేందుకు ప్రభుత్వం అందిస్తున్న ఈ సేవలను వినియోగించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్, సిబ్బంది పి.సింహాచలం, జె.ఆదినారాయణ, వెంకటరావు, కుమారి, భవాని, రేవతి, అనుష, మోహిని ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సోంపేట: బుసాబద్ర 33/11 కేవీ విద్యుత్ స్టేషన్ పరిధిలో మరమ్మతులు చేపడుతున్న కారణంగా బుధవారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు ఏఈ జి.రామారావు మంగళవారం తెలిపారు. బుసాబద్ర, మాకన్నపురం, సుంకిడి, ఎం.జి.పురం పంచాయతీ పరిధిలోని గ్రామాలకు ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు సరఫరాను నిలిపివేస్తామని.. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

సంక్షేమ వికాసమే వికసిత భారత్ లక్ష్యం

కవిటి: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల జీవన విధానంలో సమూల మార్పు, ఆర్థిక ఆదాయాభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజల విజయమే లక్ష్యంగా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు పాలన సాగిస్తున్నాయని కవిటి సర్పంచ్ పూడి లక్ష్మణరావు అన్నారు. మంగళవారం కవిటిలో వికసిత భారత్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సమావేశంలో ఎంపీడీవో పి.సూర్యనారాయణ, ఏపీవో కె.భాస్కరరావు తదితరులు కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకాలను వివరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు పూడి నీలాచలం, నిర్మలారెడ్డి పాల్గొన్నారు.

నిర్లక్ష్యం విడనాడాలి

టెక్కలి: ప్రజా రవాణా ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు తీసుకున్నప్పటికీ కింది స్థాయిలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఎస్ఎంయూఏ కార్యదర్శి బి.ధనుంజయ్ మండిపడ్డారు. మంగళవారం స్థానిక ప్రజా రవాణా డిపో ఎదుట ఉద్యోగులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ధనుంజయ్ మాట్లాడుతూ.. ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం జీవో జారీ చేసినప్పటికీ వాటిని అమలు చేసే విషయంలో అధికారులు తాత్సారం చేయడం తగదన్నారు. న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సంఘ నాయకులు డి.రమణమూర్తి, రమేష్, చలం, కిరణ్, ప్రసాద్, జి.కె.రావ్, కె.బి.రావ్, ఎస్.ఎస్.రావ్, ఆర్‌పీ రావ్, సూరిబాబు ఉన్నారు.

పలాస చేరిన ప్రజాచైతన్య యాత్ర

కాశీబుగ్గ: జగనన్నే రాష్ట్రానికి మరోసారి ముఖ్యమంత్రి కావాలని కోరుతూ జగనన్న రాష్ట్ర అభిమాన సంఘం వ్యవస్థాపకుడు కావూరి జయకుమార్ చేపట్టిన ప్రజా చైతన్య యాత్ర మంగళవారం పలాసకు చేరుకుంది. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజును కలిసిన తరువాత ఇచ్ఛాపురం బయలుదేరారు. 4,100 కిలోమీటర్లు యాత్రను ఇడుపులపాయ నుంచి ఇచ్ఛాపురం వరకు చేపడుతున్నారు.

సీఎం జగన్ పర్యటనను విజయవంతం చేయండి

- సన్నాహక సమావేశంలో మంత్రి సీదిరి అప్పలరాజు


కాశీబుగ్గ:సభాస్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి అప్పలరాజు తదితరులు

కాశీబుగ్గ: ఈ నెల 14వ తేదీన పలాసలో నిర్వహించనున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని మంత్రి సీదిరి అప్పలరాజు కోరారు. సీఎం రాక నేపథ్యంలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు, ప్రైవేటు టీచర్స్, వాణిజ్య, వర్తకులతో మంగళవారం సన్నాహక సమావేశం నిర్వహించి మాట్లాడారు. పలు అభివృద్ధి పనులను ప్రారంభించేందుకు వస్తున్న సీఎం జగన్‌కు ఘనంగా స్వాగతం పలుకుదామన్నారు.

వజ్రపుకొత్తూరు రూరల్: పలాసలో జరగనున్న సీఎం జగన్ పర్యటనకు ప్రజలు తరలి రావాలని పీఏసీఎస్ అధ్యక్షుడు దువ్వాడ మధుకేశ్వరరావు, సర్పంచ్‌లు గూడ గిరిజ ఈశ్వరరావు, కొల్లి భాస్కరరావు, పీత మోహన్ కోరారు. నగరంపల్లి, గరుడబద్ర, పెద్దబాడాం, కొండవూరు తదితర గ్రామాల్లో సర్పంచ్‌లు, పార్టీ నాయకులను మంగళవారం కలిసి కార్యక్రమానికి రావాలని విజ్ఞప్తి చేశారు.

మందస: సీఎం జగన్ పలాస పర్యటనను విజయవంతం చేయాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరారు. మండలంలోని గ్రామాల్లో మంగళవారం వారు పర్యటించారు. ప్రజలతో మాట్లాడి ముఖ్యమంత్రి జగనన్న పర్యటను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

పలాస: మండలంలోని పలు గ్రామాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి బొట్టు పెట్టి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు. పీఏసీఎస్ అధ్యక్షుడు పైల చిట్టిబాబు, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి ఉంగ సాయికృష్ణ, సచివాలయాల కన్వీనరు దువ్వాడ రవి, మామిడిపల్లిలో ఎంపీటీసీ సభ్యుడు మద్దిల పాపారావు ప్రచారం చేశారు.

వజ్రపుకొత్తూరు: అమలపాడులో సర్పంచ్ దున్న రత్నంబాలరాజు, ఉప సర్పంచ్ కారడ గిరి తదితరులు పర్యటించి సీఎం సభకు తరలిరావాలని స్థానికులను కోరారు. గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు కారాడ గిరి, డి.ఢిల్లీరావు, డీపీ కామరాజు, లింగరాజు ఉన్నారు.